క్లుప్తంగా

త్రివేణిలో సైన్స్ ఎక్స్‌పో



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని త్రివేణి హై స్కూల్ ఇంగ్లిష్ మీడియంలో జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా గురువారం త్రివేణి సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. రిటైర్డ్ రీడర్ మ్యాథమ్యాటిక్స్ డాక్టర్ జి.వి.బి.శర్మ, ఎస్వీ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ విశ్వనాథంలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందిన ప్రయోగాలను వీక్షించి అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పి.హరి తదితరులు పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకోవద్దు

ఆత్మకూర్(ఎస్) : ఆటోల్లో పరిమితికి మించి కూలీలను, ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్‌ఐ వై.సైదులు గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తుమ్మలపెన్‌పహాడ్ ఎక్స్ రోడ్ వద్ద ఆటో డ్రైవర్లకు, మిరప కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఎక్కించుకోవడం, మితిమీరిన వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఆటోలను ఎప్పటికప్పుడు ఫిట్నెస్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

నాగారం : తుంగతుర్తి నియోజకవర్గంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఫణిగిరిలో శుక్రవారం అభినందన సభను నిర్వహిస్తున్నట్లు సభాధ్యక్షుడు ఇటికాల రవీందర్ తెలిపారు. గురువారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలి



సభలో పాల్గొన్న అధికారులు, నాయకులు

సూర్యాపేట రూరల్ : పౌరులు తమ హక్కుల గురించి తెలుసుకొని, వాటిని కాపాడుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ప్రజలందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, ఆర్‌ఐ రవి, పంచాయతీ కార్యదర్శి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో విద్యార్థిని ప్రతిభ



ఎం.నందిని

సూర్యాపేటటౌన్ : చుక్కా లక్ష్మీబాయి అవార్డ్స్ కౌన్సిల్ వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 14వ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని న్యూ మిలీనియం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం.నందిని ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ బాల్తు లక్ష్మీశ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిని రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు.

స్వల్పకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ద్వారా మంజూరైన స్వల్పకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధను ధాకర్‌రెడ్డి కోరారు. గురువారం పరపతి సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. నాబార్డు నుంచి రూ.15లక్షలు మంజూరైనట్లు ఆమె తెలిపారు. అర్హత కల్గిన రైతులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సమ్మెట వెంకన్న, డైరెక్టర్లు ఏలేటి నారాయణరెడ్డి, మాతంగి వెంకన్న, కాసోజు మధనచారి, గాడ్దుల లింగయ్య, తొట్ల లక్ష్మయ్య, బద్దం సంజీవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జయసుధ

క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్

- ఎల్‌ఆర్‌ఎస్‌లో పెండింగ్ దరఖాస్తులకు మోక్షం
- మార్చి 31వరకు ఫీజు చెల్లింపు గడువు



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం

సూర్యాపేట : లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్లను క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించింది. మార్చి 31లోపు పూర్తి ఫీజు చెల్లించేందుకు గడువు ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయంతో మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సూర్యాపేట మున్సిపాలిటీలోని 34 వేల దరఖాస్తులకు మోక్షం కలగనుంది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగనుండగా ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల ఆదాయం సమకూరే అవకాశముంది. అయితే దీనిపై కొత్తగా ఎలాంటి మార్గదర్శకాలు ప్రకటించని ప్రభుత్వం.. 2020లో సూచించిన చార్జీల ప్రకారంగానే ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఆదేశించింది.

34 వేల దరఖాస్తులు..

అనుమతి లేని లేఅవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాట్లను రెగ్యులరైజ్ చేసేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా అదే ఏడాది ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31వరకు దరఖాస్తులను స్వీకరించారు. అక్రమ లేఅవుట్లు కలిగిన సూర్యాపేట పట్టణ పరిధిలోని ప్రాంతాన్ని మున్సిపల్ అధికారులు ఆరు బ్లాక్‌లుగా విభజించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.వెయ్యి చెల్లించి 33వేల దరఖాస్తులు, రూ.10,000 చెల్లించి 1000 దరఖాస్తులు అందాయి. ఇందులో కేవలం 290 మంది మాత్రమే దరఖాస్తుదారు ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకున్నారు. వీటి ద్వారా మున్సిపాలిటీకి సుమారు రూ. కోటి వరకు ఆదాయం సమకూరినట్లుగా అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో పెండింగ్‌లోని 33710 దరఖాస్తులకు మోక్షం కలగనుంది.

పాత నిబంధనల ప్రకారమే..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు ఆదేశించిన ప్రభుత్వం కొత్తగా ఎలాంటి మార్గదర్శకాలను విడుదల చేయలేదు. 2020లో అప్పటి ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారమే.. అక్రమ ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు ఆదేశించింది. ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టిసారించేందుకు పట్టణ ప్రణాళిక విభాగం సిద్ధమవుతోంది. ప్రతి దరఖాస్తును టీపీఎస్, టీపీఓ పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు సంబంధించిన ప్లాట్లు బఫర్‌జోన్, చెరువులు, కుంటలు, రైల్వే లైన్, గ్రీన్‌బెల్ట్ పరిధిలో ఉన్నయా.. లేదా అని పరిశీలించనున్నారు. నిబంధనల ప్రకారం ఉన్న ప్లాట్ల వివరాలను కమిషనర్ ఆమోదం కోసం పంపించనున్నారు. ఈ క్రమబద్ధీకరణతో మున్సిపాలిటీకి రూ.కోట్లలో ఆదాయం సమకూరే అవకాశముంది. అలాగే అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసిన పేద, మధ్య తరగతి ప్రజలకు ఆటంకాలు తొలగిపోయి అధికారికంగా అనుమతులు అందనున్నాయి.

> **మార్గదర్శకాలు అందలేదు**
>
> ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకనుగుణంగా క్రమబద్ధీకరణ చేపడతాం. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఎలా నిర్వహించాలనే దానిపై ఇంకా మార్గదర్శకాలు అందలేదు. ప్రభుత్వం ప్రకటించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలి.
>
> - బి.శ్రీనివాస్, కమిషనర్

ప్రభుత్వ వైద్యాన్నే ఆశ్రయించాలి



మాట్లాడుతున్న ఎల్.భద్రయ్య

సూర్యాపేటటౌన్ : ప్రైవేట్ వైద్యం వ్యాపారమైందని, ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని ఆశ్రయించడమే మేలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్, రిటైర్డ్ తహసీల్దార్, న్యాయవాది ఎల్.భద్రయ్య అన్నారు. డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. జనరల్ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్ సౌకర్యం లేకపోవడం శోచనీయమని, వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన విభాగాలైన కార్డియాలజీ, న్యూరో సర్జన్, న్యూరో ఫిజిషియన్ సేవలు అందుబాటులో లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు నిబంధనల మేరకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక కో కన్వీనర్ రేపాక లింగయ్య, నాయకులు అబ్దుల్ కరీం, చామకూరి నర్సయ్య, ఆవుల నాగరాజు, జగన్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, అంతయ్య, పరమేష్, సైదులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్యల కల్యాణోత్సవం



శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల కల్యాణం నిర్వహిస్తున్న చైర్మన్ దంపతులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలను వేదపండితుడు భాస్కరశర్మ అందంగా అలంకరించి మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి–శ్రీలత దంపతులు, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ రాజీవ్‌గాంధీ, వరికల్లు శ్రీను, ఎడ్ల వెంకట్‌రెడ్డి, వెన్న సైదిరెడ్డి, బిజిగ గోపి, కీర్తి వెంకట్రావు, విలాసకవి వెంకట్రావు, చింత రాంబాబు, గొట్టిపర్తి గోపయ్య, మద్ది అంజిబాబు, గొట్టిపర్తి గోవిందు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగాలని సూర్యాపేట డీఎస్పీ రవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండలంలో జన విజ్ఞాన వేదిక, ఐఎంఏ, సూర్యాపేట సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ డే వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రాజెక్టుల ప్రదర్శన, పర్యావరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బీఎం చంద్రశేఖర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మర్రి రాజేందర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్, డాక్టర్ విజయమోహన్, జి.శ్రీనివాసరాజు, వల్లబట్ల దయానంద్, మారం నారాయణరెడ్డి, సురేష్‌కుమార్, లింగయ్య, జానయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా పొన్నోత్సవం



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి పొన్నోత్సవంను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలనులో గోపికలు స్నానమాచరిస్తుండగా కృష్ణుడు వారి కోకలను (చీరలు) దొంగిలించుక పోయిన సన్నివేశాన్ని అర్చకులు రక్తి కట్టించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పొన్నచెట్టుపై ఉంచి తొలుత ఆలయ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. కాగా నర్సింహస్వామి శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు స్వామివారికి హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, కనుకు రేణుక, లక్ష్మాజీ, మాజీ జెడ్పీటీసీ కొరపిడత అవిలయ్య, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు బింగి శ్రీకాంత్, తాటిపాముల జలంధర్, పులిచెర్ల కృష్ణమూర్తి, చెన్నా రమేష్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ తృతీయ వార్షికోత్సవాలు



జలబిందెలతో తరలివస్తున్న మహిళలు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో శ్రీమల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠ తృతీయ వార్షికోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయంలో సాయంత్రం ఐదు గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం ఆడపడుచులు జల బిందెలు, మంగళహారలతో పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభానికి జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణం శివనామ స్మరణ, మల్లన్న స్వామి భక్తి కీర్తనలతో మార్మోగింది. గ్రామస్తులు ఆలయంలో కొలువైన స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు రుద్ర హోమం, నవగ్రహ హోమం చేపట్టనున్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ తెలిపింది.


ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



కుక్కడంలో మహంకాళి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో మహంకాళి ఆలయ పునర్నిర్మాణ పనులను ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, జలాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల నడుమ అమ్మవారిని గుడి నుంచి తీసి వేరే చోట ప్రతిష్ఠించి గుడి నిర్మాణ పనులను చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు వల్లపు కళింగం, ముక్కాల అవిలమల్లు, మాజీ సర్పంచ్ గుండ్ల కొమరయ్య, మద్దెల కాశీం, మద్దెల భిక్షపతి, మల్లయ్య, చంద్రయ్య, యాకయ్య, వెంకన్న, పుల్లయ్య, అయోధ్య, సోమయ్య, బసవయ్య, మల్లయ్య, యాదయ్య పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్లుగా ఎంపిక



జడిగల సైదులు



గుగులోతు మంజుల

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన జడిగల సైదులు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఫలితాల్లో ప్రతిభ కనబర్చి జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సైదులు 10వ తరగతి వరకు తుమ్మలపెన్‌పహాడ్, ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలల్లో చదివారు. అతడు ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన గురుకులాల జూనియర్ లెక్చరర్ల ఫలితాల్లో మండల పరిధిలోని రావులపల్లి తండాకు చెందిన గుగులోతు మంజుల ఎంపికైంది. ఆమె ఎంపిక పట్ల తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ



వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న సోమన్న

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు ప్రముఖ గాయకుడు డాక్టర్ ఏపూరి సోమన్న గురువారం రూ.11 వేల విలువైన వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. స్టేషన్‌కు వచ్చే వారికి తాగు నీటి సౌకర్యార్థం ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణగౌడ్, సిబ్బంది శేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



అర్వపల్లి : రామన్నగూడెం పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



తుంగతుర్తిలోని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో..

అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా మాగి శ్రీహర్ష, డీఈఓగా రేవంత్, ఎంఈఓగా తనుశ్రీ, హెచ్‌ఎంగా సింధు, ఉపాధ్యాయులుగా పి.అక్షిత్, ఎం. ఓంనాథ్, టి. పూజ, ఎం. లోహిత, ఎ. చందన, ఎం. హేమంత్, ఆర్. దీపక్ నాయక్‌లు వేషధారణల్లో అలరించారు. ప్రతిభ చూపిన వారికి హెచ్‌ఎం చిప్పలపెల్లి ధర్మయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీరవోలు నీరజ, ఇ.విజయలక్ష్మి, ఎస్.శైలజ, అంగన్‌వాడీ టీచర్ అనిరెడ్డి పుష్పలత పాల్గొన్నారు.

తుంగతుర్తిలోని ప్రాథమిక పాఠశాలలో..

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధుల, అధికారుల, ఉపాధ్యాయుల పాత్రలను పోషించి అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు సోమయ్య, సూర్యప్రకాశ్, సత్తయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌పై హర్షం

నాగారం : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 83 రోజుల్లోనే డీఎస్సీ ద్వారా 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం హర్షణీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన ప్రజాపాలనకు, ప్రజా ప్రభుత్వానికి నిదర్శనమన్నారు. పదేళ్లు పాలించిన గత ప్రభుత్వం ఎన్నికల ముందు 5,089 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయకుండా వదిలేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు అండగా నిలుస్తూ ఉద్యోగాలను భర్తీ చేస్తోందని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, నాతి వీరమల్లు, జాజుల వీరయ్య, దశరథ, ఆలకుంట్ల బాలకృష్ణ, పానుగంటి నర్సింహారెడ్డి ఉన్నారు.

సొంత భవనం నిర్మించాలని వినతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలకు సొంతభవనాలు నిర్మించాలని కోరుతూ కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం(పీపీఎల్) వ్యవస్థాపకుడు మచ్చ నర్సయ్య కోరారు. ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల సంస్థ అదనపు కార్యదర్శి హనుమంతునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కాసర్లపహాడ్‌లో గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల కోసం గతంలో 7ఎకరాల భూమిని సేకరించి గురుకుల విద్యాలయాల సంస్థకు అప్పగించారని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ సరైన భవనం లేక సూర్యాపేట జిల్లా కేంద్రంలో అద్దె భవనం నందు ఈ పాఠశాల, జూనియర్ కళాశాలను నడిపిస్తున్నారని చెప్పారు. వెంటనే సొంత భవనం నిర్మించుటకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పులేందర్, గోపాల్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



పసునూర్ మోడల్‌స్కూల్‌లో వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

నాగారం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ బి.బాలునాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుంట.రమేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నారాయణ, కేజీబీవీ ఎస్‌ఓ శిరిన్‌బేగం, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ డి.సోమలక్ష్మి, ఉపాధ్యాయులు భూతం యాకమల్లు, శ్రీనివాస్, రాజేందర్, రమేష్, కార్తీక్, మానస వీణ, కరుణాకర్, జగన్, సెరీనా, గణేష్, నాగరాజు, నరేష్, మహేష్, సాయి, వెంకన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈఈపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

నాగారం : జర్నలిస్టులను దూషించి, వారిపై దాడులకు ప్రేరేపించిన ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్యపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాగారం మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్ధమానుకోట శివారులోని పెద్దిన్ చెరువు నీటిని కాంట్రాక్టర్ చేపలు పట్టేందుకు వృథా చేస్తున్నాడని రైతులు ఫిర్యాదు చేయగా బుధవారం చెరువు పరిశీలనకు వచ్చిన ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్య విచారణ పూర్తి కాకుండానే కాంట్రాక్టరుకు వత్తాసు పలుకుతున్నాడని తెలిపారు. ఈ విషయమై ప్రశ్నించిన విలేకరులపై డీఈఈ దురుసుగా ప్రవర్తించి దూషించడం హేయమైన చర్యని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు డి.లక్ష్మణ్, కొడవకంటి వెంకన్న, ఎల్మకంటి నరేష్, వంగూరి అంజయ్య, పోర్ల మహేందర్, నీరటి జోసెఫ్, బట్టు ఆంజనేయులు, గుండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం



ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణ

నూతనకల్ : ఫిజియోథెరపీతో అంగవైకల్యాన్ని నివారించవచ్చని ఫిజియోథెరపీ డాక్టర్ కృష్ణ అన్నారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని రీసోర్స్ భవనంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారితో పలు రకాల ఎక్సర్‌సైజ్‌లు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వారి తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ఇంటి దగ్గర ఎక్సర్‌సైజ్‌లు చేయించినట్లయితే అంగవైకల్య నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, ఐఈ ఆర్పీ అప్పారావు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నూతనకల్ : ఈ నెల 3, 4 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే అఖిలభారత విప్లవ పార్టీల ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో హిందూ మతోన్మాద పాసిజాన్ని పెంపొందించడంలో బీజేపీ క్రియాశీలక పాత్ర వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నుల పంపిణీ

మద్దిరాల : 10వ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. గురువారం పోలుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన సొంత ఖర్చులతో విద్యార్థులకు పెన్నులు, కంబాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని పార్వతిరామలింగేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెలలో జరుగనున్న శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని భక్తుల సహకారంతో కల్యాణమండపాన్ని నిర్మిస్తున్నారు. సుమారు రూ.80 వేలతో ఈ మండపాన్ని నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం

మద్దిరాల : కుక్కడం గ్రామంలో బొడ్రాయి, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు గ్రామానికి చెందిన నల్లగంటి రామనర్సయ్య రూ.25,116లు, యాదవ సంఘం నాయకుడు లింగంపెల్లి మల్లయ్య రూ.25,116లు, గంగదరి సోమయ్య రూ.10,116లు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ముక్కాల అవిలమల్ల, వల్లపు కళింగం యాదవ్, బింగి సోమయ్య పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నల్లగంటి రామనర్సయ్య